సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాల విఫలం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవతి

కుత్బుల్లాపూర్‌: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణా రాష్ట్ర ఆశా వర్కర్స్‌ యూనియన్‌ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవతి అన్నారు. బి.లింగస్వామి అధ్యక్షతన షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో దుండిగల్‌ పీహెచ్‌సీలో పని చేస్తున్న ఆశా వర్కర్ల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల మంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారని వీరంతా 18 ఏళ్లుగా ఎన్‌హెచ్‌ఎం స్కీం సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. వీరు కనీస వేతనం కూడా అందడం లేదని, ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సదుపాయం కూడా లేదన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పట్టించుకోలేదని, కాంగ్రెస్‌ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తోందన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌ రెడ్డి స్పందించి ఆశావర్కర్ల జీతాల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, సీఐటీయూ కుత్బుల్లాపూర్‌ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్‌ దుండిగల్‌ పీహెచ్‌సీ ఆశా వర్కర్లు హంస, పద్మ, విజయ, సునీత, లక్ష్మి, రేణుక, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో అటిజంపై అవగాహన



అటిస్టిక్‌ ప్రైడేలో పాల్గొన్న ఏఎఫ్‌ఎఫ్‌ ప్రతినిధులు

నిజాంపేట్‌: ఆస్పిస్‌ ఫర్‌ ఫ్రీడం (ఏఎఫ్‌ఎఫ్‌) ఆధ్వర్యంలో మంగళవారం నిజాంపేట్‌లో ఆటిస్టిక్‌ ప్రైడేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ అటిజంపై అవగాహన కల్పించారు. ఏఎఫ్‌ఎఫ్‌ ప్రతినిధులు మాట్లాడుతూ యేటా జూన్‌ 18న జరుపుకునే ఆటిస్టిక్‌ ప్రైడే మొదటిసారిగా బ్రెజిల్‌లో ప్రారంభమైందన్నారు. అటిజం వ్యాధితో బాధపడే వారిని గుర్తించి వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు ఏఎఫ్‌ఎఫ్‌ ప్రయత్నిస్తోందన్నారు. పిల్లలు పుట్టిన రెండేళ్ల వరకు సరిగా మాట్లాడలేకపోవడం, వారిలో భాషా, సామాజిక నైపుణ్యాలు లేకపోవడం, మానసిక కుంగుబాటు, మాట్లాడినా స్పందించకపోవడం, జనాల మధ్య ఉండడం ఇష్టపడకపోవడం అటిజం లక్షణాలని, సరైనా సమయంలో గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. బీహేవియర్‌ థెరపీతో పాటు ఇతర రకాల థెరపీలు చేయడం ద్వారా అటిజం పిల్లలను మాములు స్థితికి తీసుకురావచ్చని పేర్కొన్నారు.

చెరువును కాపాడాలని మంత్రికి వినతి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట, పరికి చెరువును కాపాడాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్‌ నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు చెరువును పూడ్చి అమాయక ప్రజలకు ప్లాట్లను విక్రయిస్తూ మోసం చేస్తున్నారన్నారు. ఈ విషయమై స్థానిక మండల కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. చెరువును పూడ్చి ప్లాట్లు చేసి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షులు గణేశ్‌, నరేందర్‌ రెడ్డి, రవీందర్‌, రామకృష్ణ, శ్రీనివాస్‌ చారి, బుచ్చి రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి

ధరణి మారలే.!

12 వేల దరఖాస్తులకు 9,067 పెండింగ్‌
21 ప్రత్యేక బృందాల ఏర్పాటు



సాక్షి,మేడ్చల్‌ జిల్లా : భూ సంబంధిత సమస్యలపై ప్రత్యేక చొరవతో ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో మార్పులు, చేర్పులు చేసినప్పటికీ, రెవెన్యూ శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్య ధోరణి తీవ్ర జాప్యంతో పెండింగ్‌ దరఖాస్తుల పరిష్కారం జరగడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజులకే పార్లమెంట్‌ ఎన్నికలు రావడంతో కలెక్టర్‌తో సహా రెవెన్యూ యంత్రాంగం అంతా ..అదే పనిలో నిమగ్నం కావలసిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ధరణి పెండింగ్‌ దరఖాస్తుల పరిష్కారానికి పత్యేక చర్యలు తీసుకోవటంతో పాటు ఈ నెలాఖరు వరకు పరిష్కరించేందుకు కసరత్తు చేస్తోంది.

◆ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 9,067 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పైగా ప్రతి సోమవారం ప్రజావాణితో సహా మీసేవ కేంద్రాల నుంచి ధరణికి దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. బాధితులు పరిష్కారం కోసం కలెక్టరేట్‌, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ధరణి పోర్టల్‌ ప్రారంభించింది ఇక్కడే..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోనే ధరణి పోర్టల్‌ను అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రారంభించింది. 2020 అక్టోబర్‌ 20 న మూడుచింతపల్లి మండల కేంద్రంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ ప్రారంభించారు. పైసా లంచం చెల్లించకుండా భూసమస్యలు పరిష్కారమయ్యేలా.. పారదర్శకంగా పోర్టల్‌ను తీర్చిదిద్దామన్నా.. అదే పెద్ద సమస్యగా మారింది. ధరణి పోర్టల్‌తో భూసమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని భావిస్తే కొత్త సమస్యలు ఎదురుకావటంతో రైతులు, బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు.

◆ నూతన ప్రభుత్వం ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడంతో పాటు మార్పులు చేర్పులు చేసింది. దీంతో తమ భూసమస్యలు పరిష్కారం కాగలవన్న ఆశలు రైతులు, బాధిత ప్రజల్లో చిగురించాయి. వందల సంఖ్యలో రెవెన్యూ ఆఫీసుల్లో దరఖాస్తులు పేరుకుపోవడంతో రైతులు, బాధిత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినా..

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినా పరిష్కారానికి జాప్యం తప్పకపోవటంతో ఆవేదన చెందుతున్నారు. గతంలో జిల్లా అధికార యంత్రాంగం 21 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. గ్రామస్థాయిలో భూముల వివాద పరిష్కారాల్లో చురుగ్గా ఉండే వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు కావడం వల్ల క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన మండల ప్రత్యేక బృందాలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కొన్ని తహసీల్దార్‌ కార్యాలయాలకు దరఖాస్తుల పరిశీలనలో జాప్యం నెలకొనగా... రెవెన్యూ డివిజన్‌ కార్యాలయాల్లో ఎన్నికల ముందు కొంతమంది అధికారులు బదిలీ కావడంతో పరిస్థితి మొదటికొచ్చినట్లు తెలుస్తోంది.

సకాలంలో రికార్డులు దొరకక..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని పలు మండలాల్లో వివాదంలో ఉన్న రెవెన్యూ, ఇతర భూములపై కూడా దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించే క్రమంలో పాత రికార్డులను వెతకగా.. కొన్ని తహసీల్దార్‌ కార్యాలయాల్లో ఇవి అందుబాటులో లేవని తెలుస్తోంది. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిధిలో నుంచి మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కొత్తగా ఏర్పడటంతో రికార్డుల నిర్వహణకు సంబంధించి కొంత అయోమయం నెలకొన్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల మాన్యువల్‌ పహాణీలు అందుబాటులో లేకపోవడంతో కూడా దరఖాస్తుల పరిష్కారంలో ఇక్కట్లు ఎదురౌతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడం ద్వారా ఈ నెలాఖరు కల్లా పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం దృష్టిసారిస్తున్నట్లు సమాచారం.

సహనంతో ఉండాలి


జీడిమెట్ల: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉండాలంటే డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులు సహనంతో ఉండాలని కూకట్‌పల్లి డిప్యూటీ రీజినల్‌ మేనేజర్‌ కవిత అన్నారు. బోయిన్‌పల్లి, బాలానగర్‌, గండిమైసమ్మ ప్రాంతాల్లో బస్టాప్‌లు, రద్దీ, డ్రైవర్ల పనితీరును మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో మంచిగా మెదులుకోవాలని, ప్రతి బస్టాప్‌లో బస్సులు ఖచ్చితంగా ఆపాలన్నారు. వి ద్యార్థులు ఫుట్‌ బోర్డుల్లో నిలపడవద్దని కోరారు. ప్రయాణికులు బస్సులు ఎక్కి, దిగిన తర్వాతనే డ్రైవర్‌ బస్సును కదిలించాలని సూచించారు.

సర్కారు స్థలానికి ఎసరు..!

మంత్రి పీఏ అండదండలతో కబ్జాకు యత్నం
- చింతల్‌ డివిజన్‌ భగత్‌సింగ్‌నగర్‌లోని సర్వే నంబర్‌ 155లో 1100 గజాల మేర ఆక్రమణ
- సహకరించిన కొందరు అధికారులు
- స్థలాన్ని కాపాడాలని కాలనీవాసుల డిమాండ్‌



ప్రభుత్వ స్థలం మధ్యలో మంగళవారం గోడ నిర్మిస్తున్న దృశ్యం



2007లో అప్పటి తహసీల్దార్‌ ఇచ్చిన సర్వే రిపోర్టు

చింతల్‌: ఓ మంత్రి పీఏ అండదండలతో సర్కారు స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు యత్నించగా అడ్డుకోవాల్సిన అధికారులే సహకరిస్తున్నరన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. చింతల్‌ డివిజన్‌ భగత్‌సింగ్‌నగర్‌లోని ఓ ప్రభుత్వ స్థలంలో నిర్మించిన బేస్‌మెంట్లను 2021లో అప్పటి అధికారులు కూల్చివేశారు. అయితే తర్వాత మరో అధికారి అసలు ఇది ప్రభుత్వ స్థలమే కాదంటూ సర్వే పేరుతో అన్ని విభాగాల అధికారులను తప్పుదోవ పట్టించి అక్రమార్కులకు కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలాన్ని అప్పజెప్పేందుకు యత్నించగా ఇందుకు గాజులరామారం సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌, టౌన్‌ప్లానింగ్‌, ఇంజినీరింగ్‌ అధికారులు సమాయత్తమవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ప్రభుత్వ స్థలాన్ని రక్షించాల్సిన వారే కబ్జాకు తెరలేపారని భగత్‌సింగ్‌నగర్‌వాసులు ఆరోపిస్తున్నారు.

సర్వే పేరుతో స్వాహాకు యత్నం.


చింతల్‌ డివిజన్‌ భగత్‌సింగ్‌నగర్‌లోని సర్వే నంబర్‌ 155లో 29 గుంటలు (3553 గజాలు) ఉన్నట్లు 2008 లో సర్వే నిర్వహించి హద్దులు పాతారు. మళ్లీ 2021లో సర్వే చేసి 3553 గజాల స్థలం ఉన్నట్లు అప్పటి రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు తేల్చి ఫెన్సింగ్‌ వేసేందుకు నిధులు మంజూరు చేసి 90 శాతం పనులు పూర్తిచేశారు. కేవలం 10 శాతం మాత్రమే ఫెన్సింగ్‌ వేయాల్సి ఉండగా 2023లో మిగితా పనులకు నిధులు మంజూరు చేశారు. దీంతో ఫెన్సింగ్‌ వేయాల్సిన ఇప్పటి డిప్యూటీ కమిషనర్‌ కబ్జాదారులకు అప్పజెప్పే ప్రయత్నంలో భాగంగా ఫిబ్రవరి 28 2024న మళ్లీ జిల్లా సర్వే నిర్వహించగా 29 గుంటలు ఉన్నట్లుగా సర్వే రిపోర్ట్‌ వచ్చింది. అయితే దాని ప్రకారం కాకుండా మూడు రోజులు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వచ్చిన ఓ అధికారితో మరో సర్వే రిపోర్టు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపించాయి. దీంతో జిల్లా ఏడీ సర్వే అధికారి లొకేషన్‌ స్కెచ్‌–డిజిటల్‌ మ్యాపు బుట్ట దాఖలయింది. ఏడీ సర్వే చేస్తే ఇన్‌చార్జి తహసీల్దార్‌ లొకేషన్‌ మ్యాపు సుమారు 8 ప్లాట్ల మేర తగ్గించి ఇవ్వడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మంత్రి పీఏ పేరుతో ఆక్రమణకు యత్నం..

10 శాతం మేర ఫెన్సింగ్‌ వేసేందుకు ముందుకు రాని నేతలు సర్వే పేరుతో కబ్జాకు తెరలేపారు. ఓ ప్రధాన పార్టీ నుంచి ఓడిపోయిన నేత సహయంతో రెవెన్యూ మంత్రి పీఏ ద్వారా సచివాలయం నుంచి అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇన్‌చార్జి తహసీల్దార్‌తో తప్పుడు సర్వే రిపోర్టు తెచ్చినట్లు భగత్‌సింగ్‌నగర్‌లో హట్‌టాపిక్‌గా మారింది. సుమారు 8 ప్లాట్ల మేర 1100 గజాల స్థలం ధోబీఘాట్‌ వాసుల పేరిట కొందరు కబ్జాకు పాల్పడుతున్నట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ విషయమై 'సాక్షి' అధికారులను వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

పత్తాలేని సర్వే రిపోర్టు..

ఇప్పటికే మూడుసార్లు సర్వే నిర్వహించగా 3500 గజాల స్థలం కొలతలతో కూడిన లొకేషన్‌ స్కెచ్‌ మ్యాపు కాకుండా 8 ప్లాట్ల మేర అనగా సుమారు 1100 గజాల మేర పక్కనే ఉన్న ధోబీ ఘాట్‌ వాసులకే చెందుతుందని లొకేషన్‌ మ్యాప్‌ లేకుండా 24 ఏప్రిల్‌ 2024న డిప్యూటీ కమిషనర్‌ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్‌, ఇంజినీరింగ్‌ అధికారులు ముగ్గు పోశారు. అప్పటికే 10 శాతం మేర ఫెన్సింగ్‌ వేసేందుకు మంజురైన నిధుల గడువు ముగిసిపోవడంతో అవి వెనక్కి వెళ్లాయి.



25-7-2019లో జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్వహించిన సర్వే రిపోర్టు



28-02-2024న జిల్లా సర్వే రిపోర్ట్‌ (డిజిటల్‌ లే-అవుట్‌)

బస్సు సౌకర్యాన్ని పునఃప్రారంభించాలి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

కుత్బుల్లాపూర్‌: తమ ప్రాంతానికి బస్సు సౌకర్యాన్ని పునఃప్రారంభించాలని కోరుతూ పద్మానగర్‌ సంక్షేమ సంఘం నేతలు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మానగర్‌ ఫేజ్‌–2 రింగ్‌ రోడ్డు నుంచి గతంలో సికింద్రాబాద్‌, అఫ్జల్‌గంజ్‌, కోఠి ప్రాంతాలకు బస్సు ఉండేదని, అయితే లాక్‌డౌన్‌ సమయంలో నిలిపేశారన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని సూచించారు. అందజేసిన వారిలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, కోశాధికారి సంజీవ్‌ కుమార్‌, సభ్యులు దుర్గాప్రసాద్‌, మల్లారెడ్డి, దుర్గారెడ్డి, శోభన్‌, వీరేష్‌ తదితరులు ఉన్నారు.


పాఠశాలలో హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

దుండిగల్‌: విద్యార్థులు చదువులో సత్ఫలితాలు సాధించాలని యేటా హోమాన్ని నిర్వహిస్తున్నట్లు శిఖర స్కూల్‌ ప్రిన్సిపాల్‌ హేమలత అన్నారు. బౌరంపేటలోని శిఖర స్కూల్‌లో మంగళవారం హోమం నిర్వహించారు. ఇందులో పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మంత్రోచ్ఛారణను శాస్త్రీయంగా పలికించారు.

చెత్తను తొలగించరూ..!



రోడ్డుపైనే పారబోసిన చెత్త

జీడిమెట్ల: సుభాష్‌నగర్‌ డివిజన్‌ వెంకటాద్రినగర్‌లోని కొంతమంది కుటీర పరిశ్రమలు, దుకాణాల నుండి చెత్తను తీసుకువచ్చిరోడ్లపైనే పారబోస్తున్నారు. దీంతో పందులు, కుక్కలు చెత్తకుప్పల వద్ద తిరుగుతుండడంతో దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్‌ అధికారులు స్పందించి రోడ్లపై చెత్తను వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



వరప్రసాద్‌ (ఫైల్‌)

నిజాంపేట్‌: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా గోకవరానికి చెందిన వరప్రసాద్‌ (45) కుటుంబం బాచుపల్లి సాయినగర్‌లో నివాసముంటోంది. రియల్‌ఎస్టేట్‌ వ్యాపారం చేసే వరప్రసాద్‌కు భార్య శైలజ, కుమారుడు ఉన్నారు. కాగా కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వరప్రసాద్‌ 4 నెలలుగా ఇంటి అద్దె సైతం చెల్లించడం లేదు. దీంతో ఇంటి ఓనర్‌ తల్లి ఈ విషయమై పలుమార్లు అడిగింది. ఈ నెల 15వ తేదీన ఉదయం భార్య శైలజను పోచారంలోని పుట్టింటికీ వెళ్లేందుకు మెట్రో రైలు ఎక్కించాడు. అదే రోజు సాయంత్రం కుమారుడితో కలిసి వరప్రసాద్‌ సైతం పోచారం వెళ్లాడు. అయితే పని నిమిత్తం అదే రోజు రాత్రి సాయినగర్‌కు వచ్చాడు. అద్దె విషయమై ఇంటి ఓనర్‌ తల్లి లక్ష్మీనర్సమ్మ సోమవారం సాయంత్రం ఫోన్‌ చేసి అమర్యాదగా మాట్లాడింది. ఈ కాల్‌ను రికార్డు చేసిన వరప్రసాద్‌ తన భార్యకు పంపాడు. ప్రసాద్‌ భార్య శైలజతో రాత్రి వరకు ఫోన్లో మాట్లాడాడు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఫోన్‌ ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చిన భార్య, కుమారుడు సాయినగర్‌కు రాగా ఇంటి తలుపు తెరిచి ఉంది. లోనికి వెళ్లగా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులకు తోడు ఇంటి యజమాని తల్లి వేధింపులే తన భర్త ఆత్మహత్యకు కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యుత్‌ మీటర్ల వద్ద ఇలా..



మ్యాన్‌ హోల్‌ నుంచి పారుతున్న మురుగు

డ్రైనేజీ సమస్యను పట్టించుకోరూ..

జగద్గిరిగుట్ట: డివిజన్‌ పరిధిలోని రాజీవ్‌ గృహకల్పలో వారం రోజులుగా డ్రైనేజీ పొంగి పొర్లుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. ముఖ్యంగా 19,28,29,30 31 బ్లాక్‌ల్లో సుమారు 120 కుటుంబాలు ఉంటున్నాయి. ఈ బ్లాక్‌ల్లో 2 నెలల క్రితం సీసీ రోడ్లు వేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్లు వేసే సమయంలో సిమెంట్‌ కాంక్రీట్‌ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలోకి వెళ్లడంతో సమస్య మొదలైంది. ఈ విషయమై వాటర్‌ అధికారులకి వారం క్రితం ఫిర్యాదు చేయగా పరిశీలించి, కొత్త పైప్‌లైన్‌ వేయాలని చెప్పి వెళ్లనట్లు స్థానికులు తెలిపారు. అయితే ఇప్పటికీ పనులు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఈ విషయమై వాటర్‌ వర్క్స్‌ అధికారి ఝాన్సీని వివరణ కోరగా త్వరలోనే కొత్త పైపులైన్‌ పనులు ప్రారంభించి శాశ్వత పరిష్కారం చూపుతామని అప్పటి వరకు తాత్కాలికంగా ఎప్పటికప్పుడు క్లీన్‌ చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు.

ఫాస్ట్‌ ట్రాక్‌ చట్టాన్ని అమలు చేయాలి

ప్రజా సంఘాల డిమాండ్‌

బాలానగర్‌: మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా వారికి మాత్రం రక్షణ లేకుండా పోతోందని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఫాస్ట్‌ ట్రాక్‌ చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్‌, డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి చైతన్య రెడ్డి, ఐద్వా మండల కార్యదర్శి వి. కరుణ డిమాండ్‌ చేశారు. పెద్దపల్లి జిల్లాలో 6 సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేండిల్‌ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లాలో తల్లితో పాటు నిద్రిస్తున్న ఆరేళ్ల బాలికను రైస్‌ మిల్‌ డ్రైవర్‌ బలరాం ఎత్తుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిపారు. ఆ మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్‌ చేశారు. ప్రస్తుతం మహిళలు, బాలికలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, చట్టాలపై భయం ఉంటేనే వేధింపులకు కళ్లెం వేయగలమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు కార్తిక్‌, ఐద్వా మండల అధ్యక్షురాడు భాగ్యలక్ష్మి, సీఐటీయూ నాయకులు పి. శంకర్‌, సతీష్‌, అనిత, మౌనిక, కవిత, దీప్తి, రాజు, మల్లేష్‌, మాధవి, శ్రవణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..?



రాంరెడ్డినగర్‌లో రోడ్డుపైనే నిలిచిన నీరు

జీడిమెట్ల: సుభాష్‌నగర్‌ డివిజన్‌ రాంరెడ్డినగర్‌ రోడ్డు అధ్వానంగా మారింది. వర్షం కురిసినప్పుడల్లా వరద వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నీరు నిల్వ ఉంటుందని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్‌ అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానం



కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారు



అన్నదానం చేస్తున్న మహిళలు

కుత్బుల్లాపూర్‌: జీడిమెట్ల డివిజన్‌ పేట్‌ బషీరాబాద్‌ సర్వేనెంబర్‌ 25/1 లోని కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోజురోజుకు భక్తుల తాకిడి ఎక్కువవుతుందని అయినా సరిపడా ఆహారాన్ని వండుతున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్‌ రెడ్డి, శైలజ దంపతులు తెలిపారు. గత రెండేళ్లుగా ప్రతి మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వీరామంగా నిర్వహిస్తున్నట్ల ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

జీడిమెట్ల: ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జీడిమెట్ల పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం మండలం కొల్లూరు గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మణ్‌ (34) కుటుంబంతో కలిసి నగరానికి వలసవచ్చి చింతల్‌ పద్మానగర్‌ ఫేజ్‌–2లో ఉంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. అతనికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈనెల 17వ తేదీన లక్ష్మణ్‌ ఆస్తి సంపకాల విషయంలో అన్నదమ్ములతో మాట్లాడేందుకు స్వగ్రామానికి వెళ్తున్నానని భార్యతో చెప్పి వెళ్లాడు. సాయంత్రం లక్ష్మణ్‌ భార్య నాగమణి ఫోన్‌ చేయగా సంగారెడ్డిలో ఉన్నానని ఊరికి వెళ్తున్నానని చెప్పాడు. రాత్రి ఫోన్‌ చేయగా ఎత్తలేదు. దీంతో ఊర్లోవారికి ఫోన్‌ చేయగా రాలేదని చెప్పారు. మంగళవారం ఉదయం కుత్బుల్లాపూర్‌ మున్సిపల్‌ కార్యాలయం వెనుకలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు అక్కడ లభించిన ఫోన్‌ నంబర్‌కు కాల్‌ చేయగా నాగమణి ఫోన్‌ ఎత్తింది. విషయాన్ని ఆమెకు తెలియజేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ భవన నిర్మాణాన్ని నిలిపేయండి



మాక్సిమస్‌ అపార్ట్‌మెంట్‌ పక్కనే రోడ్డు స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణం

నిజాంపేట్‌: రోడ్డు స్థలాన్ని ఆక్రమించి చేపడుతున్న భవన నిర్మాణాన్ని నిలిపి వేయాలని కోరుతూ బాచుపల్లి కౌసల్య కాలనీ అసోసియేషన్‌ సభ్యులు నిజాంపేట్‌ కమిషనర్‌, టౌన్‌ప్లానింగ్‌ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్‌ శివప్రసాద్‌ మాట్లాడుతూ కౌసల్య కాలనీలోని మిక్సిమస్‌ అపార్ట్‌మెంట్‌ పక్కన 20 ఫీట్ల రోడ్డు స్థలం ఉందన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి సదరు స్థలంలో నిర్మాణానికి చేపడుతున్నాడన్నారు. రోడ్డు స్థలంలో నిర్మాణానికి అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని, ఇది పూర్తయితే రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్నారు. మున్సిపల్‌ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కేంద్రమంత్రులకు ఘనంగా స్వాగతం పలుకుదాం



సమావేశంలో పాల్గొన్న నేతలు

చింతల్‌: కేంద్రమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసి ఈ నెల 20న మొదటిసారిగా రాష్ట్రానికి వస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌కు ఘనంగా స్వాగతం పలుకుదామని మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా అర్బన్‌ కన్వీనర్‌ డాక్టర్‌ ఎస్‌ మల్లారెడ్డి అన్నారు. చింతల్‌లోని జేఎస్‌ కన్వెన్షన్‌లో కుత్బుల్లాపూర్‌ కన్వీనర్‌ జేకే శేఖర్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న కుత్బుల్లాపూర్‌ అసెంబ్లీ కార్యాలయానికి మధ్యాహ్నం 2 గంటల వరకు నాయకులు కార్యకర్తలు తరలి రావాలన్నారు. అనంతరం అక్కడ నుంచి బేగంపేట ఎయిర్‌ పోర్ట్‌కు బయలుదేరాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ రావుల శేషగిరి రావు, సుబ్బారావు, రాజి రెడ్డి, శేఖర్‌ ముదిరాజ్‌, కృష్ణా రెడ్డి, సుమన్‌, సులోచన, సాయి నేత, పున్నరెడ్డి, సతీశ్‌ రాజేశ్వర్‌ రావు, దుర్యోధనరావు, శ్రీరాములు, బలరాం, శ్రీధర్‌ వర్మ, భానుచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా

కుత్బుల్లాపూర్‌: సీఎంఆర్‌ఎఫ్‌తో పేద ప్రజలకు ఎంతో భరోసా కలిగిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నేత కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. కుత్బుల్లాపూర్‌ డివిజన్‌ పద్మానగర్‌ ఫేజ్‌–1కు చెందిన కొట్టె రమణ అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. వైద్య ఖర్చులను భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో శ్రీశైలంగౌడ్‌ను సంప్రదించగా రూ.2.5 లక్షలను అత్యవసర వైద్య సేవల కోసం మంజూరు చేయించారు. సదరు ఎల్‌ఓసీ పత్రాన్ని షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో బాధితుడికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు బుచ్చిరెడ్డి, ఖాజా, మధుసూదన్‌ తదితరులు ఉన్నారు.